క్లుప్తంగా

ఆదోని కవయిత్రికి పురస్కారం



పురస్కారం అందుకున్న నాగజ్యోతి

ఆదోని అర్బన్ : కర్ణాటక–తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కవయిత్రి మలేకర్ నాగజ్యోతి ఉగాది పురస్కారం అందుకుంది. బెంగళూరులో కవితా సంపుటిలను ఎన్నుకుని ఆదివారం కవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు పట్టణానికి చెందిన కవయిత్రి నాగజ్యోతి రచించిన 'వెన్నెల్లో నక్షత్రాలు' అనే కవితా సంపుటికి మంచి ఆదరణతో పాటు పురస్కారం కూడా దక్కింది. రచయితల సమాఖ్య జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ ఆమెకు పురస్కారం అందజేశారు.

అన్నమాచార్య సంకీర్తనల పోటీలు



బహుమతి అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

ఆదోని అర్బన్ : అన్నమాచార్య ఆరాధనోత్సవాల సందర్భంగా గరుడాద్రి సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంగరాయ సన్నిధిలో యువతకు, బాలబాలికలకు అన్నమాచార్య సంకీర్తనలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే.. సంప్రదాయ వస్త్రధారణ పోటీలు కూడా నిర్వహించి గెలుపొందిన వారికి వెండి వస్తువులను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమానికి వేదపండితుడు, ఆధ్యాత్మిక ప్రవచకుడు సుస్వరం నాగారాచార్యులు బహుమతులు అందజేశారు. అనంతరం అన్నమాచార్యుల గురించి వివరించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు, మహిళలు, సేవాసంఘం అధ్యక్షుడు దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థి సోమశేఖర్

కౌతాళం: మండలంలోని నదిచాగి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైన్స్ ప్రాజెక్టుల జిల్లా స్థాయి ప్రదర్శన, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 24 మంది విద్యార్థులను ఎంపిక చేయగా అందులో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి చాకలి సోమశేఖర్ ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఆర్.ఎల్.ఎస్ ప్రసాద్, విద్యార్థి ని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఎస్సీలకు ప్రాధాన్యం



రామాంజనేయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : వైఎస్సార్‌సీపీ పాలనలో ఎస్సీలకు అధిక ప్రాధాన్యం లభిస్తోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఆదోని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, జిల్లా అధ్యక్షుడు సాయిరామ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన రామాంజనేయులను ఘనంగా సన్మానించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాయిరామ్, సీనియర్ నాయకులు స్వామి, ఆంజనేయులు, కేశవమాస్టర్ పాల్గొన్నారు.

4న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం సందర్భంగా ఏప్రిల్ 4వ తేదీన సూపర్ లగ్జరీ (హైటెక్) ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్–93999)ను నడపనున్నట్లు కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మంగళవారం సాయంత్రం 6గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, బుధవారం తెల్లవారు జామున 4:30గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, గురువారం ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం ప్రత్యేక బస్సు చార్జీ రూ.2 వేలు ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్ 7382871131, 9959225794 (తన) నంబర్లకు ఫోన్ చేయాలని, లేదా సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

వేలం.. జరిగేనా?



- ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన మార్కెట్ల వేలాలు
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టేందుకు కాంట్రాక్టర్ల ఎత్తులు
- వేలంలో ఎక్కువ మంది పాల్గొనకుండా డీల్
- తాము నిర్ణయించుకున్న ధరకే దక్కించుకునేలా సన్నాహాలు
- నిబంధనల ప్రకారమే జరుపుతామంటున్న అధికారులు
- నేటి వేలాలపై సర్వత్రా ఆసక్తి

ఆదోని టౌన్ : ఆదోని మున్సిపాలిటికీ ప్రధాన ఆదాయ వనరులు వివిధ రకాల మార్కెట్లు. ఏడాది కాలపరిమితితో జరిగే వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరుతుంది. అయితే వేలాలు అధిక ధరకు పలుకకుండా, తమకు నచ్చిన వారికే దక్కేలా చేసేందుకు కాంట్రాక్టర్లు రింగ్‌లా మారి ఆదాయానికి గండికొట్టేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక శాతం కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనకుండా చూస్తున్నారు. అలాగే అధికారులు నిర్ణయించిన ధర కంటే తక్కువ ధరకు కోట్ చేస్తుండటంతో వేలాలు వాయిదా పడుతున్నాయి. చివరకు తాము అనుకున్నది జరిగేలా వారు పరిస్థితులను క్రియేట్ చేస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన మార్కెట్ల వేలాలు సోమవారం జరిగే వాటిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సారైనా వేలాలు సజావుగా జరుగుతాయా అనే సందేహాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టేందుకే కాంట్రాక్టర్‌లు వేస్తున్న ఎత్తుల్లో అధికారులు చిక్కుకుపోతారా అనేది చూడాల్సి ఉంది. ఆదోని మున్సిపాలిటీలో ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, పశువుల సంత, మార్కెట్, కమేళా, గొర్రెలు, మేకల సంతకు వేలం వేయనున్నారు. ఆయా మార్కెట్‌ల ద్వారా యేడాది పాటు సుంకం వసూలు చేసుకునే హక్కుకు వేలం పాటలను నిర్వహిస్తారు. ఫిబ్రవరి 16న వేలం నిర్వహించారు. కాంట్రాక్టర్‌లు ఎవరూ పాల్గొనకపోవడంతో 20వ తేదీకి వాయిదా వేశారు. అయితే అదే రోజు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించడంతో అధికారులంతా సమావేశానికి వెళ్లడంతో వేలం వాయిదా పడింది. ఈనెల 6న వేలం నిర్వహించగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల వాయిదా పడ్డాయి. దీంతో అధికారులు నేడు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. మున్సిపల్ ఆదాయానికి గండికొట్టేందుకు, తాము అనుకున్న ధర లభించాలని, ఎక్కువ మంది కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన కుండా వారంతా కుమ్మక్కై, ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారు నిర్ణయించిన మేరకే మార్కెట్‌లను చేజిక్కించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. అయితే అధికారులు మాత్రం పకడ్బందీగా మార్కెట్‌ల వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనల మేరకే వేలం నిర్వహిస్తాం



మున్సిపల్ నిబంధనల మేరకే మార్కెట్ వేలం పాటలు జరుగుతాయి. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదు. మార్కెట్‌ల ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్‌లు సాల్వెన్సీ, డిపాజిట్‌లు చెల్లించిన తర్వాతే వేలంలో పాల్గొంటారు. ఆదాయానికి గండికొట్టడానికి వీలు లేకుండా చూస్తాం. అలా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిస్తే ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం. ఏదైనా నిబంధనల మేరకు జరుగుతుంది. ఎవరి ప్రోద్బలం ఉండదు.

– రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



విద్యుత్ తీగలు లాగుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది



ట్రాన్స్ ఏర్పాటు చేసిన అధికారులు

కోసిగి: మండలంలో శనివారం ఈదురు గాలులు, అకాల వర్షం కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లు నెలకొరిగిపోయాయి. స్థానిక కడపాలెం వీధిలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 8 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఆదివారం ఉదయం నుంచి ట్రాన్స్‌కో వీరేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు యుద్ధ ప్రాతిపదికను ఏర్పాటు చేయించారు. అలాగే మండలంలోని దేవరబెట్ట, ఆర్లబండ గ్రామాల్లో మరో 4 ట్రాన్స్‌ఫార్మర్లు, 32 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు తెలిపారు. వేగవంతంగా పనులు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ తెలిపారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంత్రాలయంరూరల్: మండలంలోని మాధవరం గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు మాధవరం పోలీసులు తెలిపారు. కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన సిద్ధప్ప (29) తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


23న బండలాగుడు పోటీలు

పాణ్యం: ఎస్. కొట్టాల గ్రామంలో ఈనెల 23వ తేదీన ఆరు పండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. శ్రీ హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలిచిన వృషభాల యజమానులు ముందుగా రూ.400ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు సెల్: 9642517339, 6304594451, 9666954464కు సంప్రదించాలన్నారు.

తొలిమొక్కు నాగలూటి వీరభద్రస్వామికే



నల్లమల అంచుల్లోవెలసిన నాగలూటి క్షేత్రం,



భక్తులకు రక్షకుడిగా కొలువుదీరిన శ్రీవీరభద్రస్వామి

- కన్నడ, మహారాష్ట్రీయులకు ఆరాధ్యదైవం
- భక్తులతో కిటకిటలాడుతున్న నాగలూటి

ఆత్మకూరు: కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు లక్షలాదిగా ఉగాది పర్వదినం సందర్భంగా తమ ఆడబిడ్డగా భావించే శ్రీశైల భ్రమరాంబాదేవిని దర్శించుకునేందుకు వందల కిలోమీటర్ల కాలినడన తరలివెళ్లడం అనాదిగా కొనసాగుతోంది. అయితే వారు భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దర్శనాని కంటే ముందుగా తమ ఆరాధ్యదైవమైన నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకొని, తొలి మొక్కు సమర్పించి శ్రీగిరికి బయలు దేరడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఉగాది బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులు లక్షలాదిగా నల్లమల కొండల్లో వెలసిన నాగలూటికి తరలిరావడంతో ఈ క్షేత్రం గత పదిరోజులుగా కిటకిటలాడుతోంది.

ఆరాధ్యదైవానికే తొలిమొక్కులు :

రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వందల కిలోమీటర్ల దూరం కాలినడకన శివనామస్మరణ చేస్తూ కావడితో, రథాలు, గుర్రాలతో స్వామివారి సన్నిధికి తమ స్వస్థలం నుంచి శ్రీశైలక్షేత్రానికి బయల్దేరుతారు. ప్రతి భక్తుడు నాగలూటి క్షేత్రం చేరుకోగానే దీపారాధాన, ధూపదీపనైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇలా సమర్పించి వీరభద్రస్వామి ఆశీస్సులు పొంది మల్లన్న దర్శనం కోసం యాత్ర కొనసాగిస్తారు.

భక్తుల రక్షకుడు

శ్రీశైలమహాక్షేత్రానికి మహాశివరాత్రి , ఉగాది పర్వదినాల సందర్భంగా కాలినడకన వెళ్లే లక్షలాది మంది శివభక్తులకు వీరభద్రస్వామిని దర్శించుకుని క్షేత్రానికి వెళ్లడం జరుగుతుంది .నాగలూటిలో వెలిసిన వీరభద్రస్వామిని కర్నాటక, మహారాష్ట్ర భక్తులే కాకుండా తెలుగు వారు సైతం శరభ, శరభ, భద్ర.. భద్ర అంటూ నాగలూటి వీరభద్రస్వామిని ప్రార్థిస్తూ నల్లమల కొండల వెంట శివనామస్మరణతో పాటూ వీరభద్రస్వామిని స్మరించుకుంటూ తొలిపూజ నిర్వహించి వెళ్తారు. వీరభద్రస్వామి లక్షలాది మంది భక్తుల రక్షకుడిగా ఉంటూ నల్లమల అటవీ ప్రాంతంలో వారిని సంరక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, కాళ్లకు ఎలాంటి గాయాలు కాకుండా మల్లన్న సన్నిధికి చేర్చుతాడనేది నమ్మకం . అందుకే వీరభద్రస్వామికి తొలిమొక్కు చెల్లించి శ్రీశైలం పయనమవుతారు. కొన్నేళ్ల క్రితం వరకు ఎలాంటి రవాణా మార్గాలు లేనప్పుడు కాలినడకే ప్రధాన మార్గం కావడం వలన ప్రతి ఒక్కరు కాలినడకనే శ్రీశైలక్షేత్రం వెళ్లే వారు ప్రస్తుతం రోడ్డు మార్గం ఏర్పడినప్పటికీ వాహనాల్లో వెళ్లేవారు సైతం వీరభద్రస్వామిని దర్శించిన తరువాతం ముందుకు సాగుతున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న నాగలూటి క్షేత్రం

ఉద్యోగ భద్రత కల్పించాలి

హొళగుంద: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యాలయాల్లో చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాల పోషణ కష్టంగా మారిందని, పనికి తగిన వేతనం అమలు చేయాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

ఆదోని రూరల్ : ఈనెల 20వ తేదీన స్పందన కార్యక్రమాన్ని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

22 నుంచి వసంత నవరాత్రి పూజలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ ఉగాది పర్వదినం మొదలు కొని శ్రీరామ నవమి వరకు శ్రీ మహాగౌరీ అమ్మవారికి వసంత నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. అభిషేకాలు, సహస్రనామార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమావాస్యను పురస్కరించుకొని ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు నవగ్రహ, లక్ష్మీ, గణపతి, మూల మంత్ర చండీహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి సింధూరార్చన, దోష నివారణ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బండిపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్ : మండలంలోని కడితోట గ్రామానికి చెందిన అబ్దుల్లా అనే వ్యక్తి ఎద్దుల బండిపై నుంచి కిందికి పడి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాలు.. ఆదివారం గ్రామంలో ఎద్దుల బండిపైకెక్కి పత్తి కట్టి కడుతుండగా ప్రమాదవశాత్తు కిందకు పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

ప్రమాదకరంగా లోలెవల్ వంతెనలు



బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న భారీ వాహనాలు (ఫైల్),



గుంతలు పడి అధ్వానంగా మారిన వేదావతి బ్రిడ్జి

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక రాష్ట్రాల మధ్య తిరుగుతున్న భారీ వాహనాలతో ఎల్లెల్సీ, వేదావతి (హగరి) నదిపై నిర్మించిన బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలకు అనువుగా ఉన్న బ్రిడ్జిలకు భారీ వాహనాల వల్ల ముప్పు ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీపై 1947లో బ్రిడ్జి నిర్మించారు. బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. భారీ వాహనాలు వెళితే బ్రిడ్జ్ నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయి. కంకర, సిమెంట్ నల్ల బండలు, ఇసుక లోడుతో హెవీ వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు దెబ్బ తింటున్నాయి. ఎల్లెల్సీ బ్రిడ్జిపై దాదాపు 8 టన్నులు, వేదావతి (హగరి) బ్రిడ్జి 15 టన్నుల బరువున్న వాహనాల సామర్థ్యాన్ని తట్టుకునేలా నిర్మించారు. అయితే 30 టన్నులకు పైగా బరువున్న వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు పటిష్టత కోల్పోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి బ్రిడ్జిలకు మరమ్మతులు చేపట్టడం లేదా కొత్తవి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కర్ణాటక భక్తులతో మహానంది కిటకిట

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కన్నడ భక్తులు వేలాది సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. రాతి నందివిగ్రహం, పెద్ద నంది విగ్రహాలను భక్తులు తిలకించారు.



మహానందీశ్వరుడి దర్శనం కోసం వేచి ఉన్న కన్నడభక్తులు

ఎన్‌పీసీఐకు అనుసంధానం చేయించండి



మాట్లాడుతున్న ఏపీఓ మాలిక్‌బాషా

నందవరం: ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించాలని ఏపీఓ మాలిక్‌బాషా ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్ కార్డుకు ఆధార్, బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్‌పై టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 26,202 మంది ఉపాధి కూలీలు ఉన్నారని పేర్కొన్నారు. అందులో 26,017 మందికి జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేశామన్నారు. వీరిలో 23,856 మందికి బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ చేయించామన్నారు. మిగిలిన 2,161 మందికి ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ పూర్తి చేసి ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేయాలని ఎఫ్‌ఏలకు సూచించారు. ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ పూర్తయితేనే ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతాలకు జమ అవుతాయని వివరించారు. పల్లెల్లో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్ చేయించాలన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

హొళగుంద: ఈ నెల 22న జరిగే ఉగాది పండుగతో పాటు గ్రామంలో జరిగే సుంకులమ్మ జాతరను పురస్కరించుకుని పెద్దగోనెహాళ్ గ్రామ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆయా వీధుల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు. డ్రైనేజీలలో మురుగునీరు, పూడికను తొలగించారు. దోమలు, వ్యాధులు ప్రబలకుండా వీధుల్లో చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. వీధుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు చెత్తచెదారాన్ని వీధుల్లో పారవేయకుండా శుభ్రత పాటించాలని సర్పంచ్ కోరారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం చేశారు.

దేవాలయాలకు నవ్య శోభ

- ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రణాళికలు
- జిల్లాలో 13 గుడుల పునర్నిర్మాణానికి అనుమతులు
- రూ.11.43 కోట్ల నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు ఆలయాలు నవ్య శోభను సంతరించుకోనున్నాయి. ఆయా దేవాలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. జిల్లాలోని 13 దేవాలయాలకు సంబంధించి ఆధునికీకరణ, పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.11.43 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద రూ.9,53,50,000, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద 1,90,70,000 నిధులు ఉన్నాయి. ఈనిధులతో ఆలయాల రూపు మారి అధునాతనంగా దర్శనమివ్వనున్నాయి.



పెరవలి రంగనాథ స్వామి ఆలయం



గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయం

త్వరలోనే పునరుద్ధరణ పనులు ప్రారంభం



జిల్లాలోని 13 ఆలయాల్లో పునఃనిర్మాణ, ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు వచ్చాయి. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపడతాం. కామన్ గుడ్ ఫండ్‌తో పాటు ఆలయాల మ్యాజింగ్ గ్రాంట్ నిధులను కలుపుకొని నిర్మాణ పనులకు నిధులు వెచ్చిస్తాం. ఈ నిధులతో ఆలయాల రూపు రేఖలు మారతాయి. – ఆదిశేషు నాయుడు, సహాయ కమిషనర్, దేవదాయ శాఖ

పునరుద్ధరణకు కేటాయించిన నిధులు ఇలా..

- ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు.
- ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలోని శ్రీ లక్ష్మి సమేత మాధవ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- కర్నూలు నగరం కన్నప్ప చౌల్ట్రీలోని శ్రీ సత్య నారాయణ స్వామి కల్యాణ మండపం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.75 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.15 లక్షలు.
- కర్నూలు కుమ్మరి వీధిలోని శ్రీ రాంబొట్ల దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కర్నూలునగరంలోని శ్రీకోట ఆంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- దేవనకొండ మండలం కప్పట్రాళ్లలోని శ్రీ కొలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.20 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.24 లక్షలు.
- గద్దెరాళ్ల గ్రామం శ్రీ గద్దెదాళ్ల మారెమ్మ ఆలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1.15 కోట్లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.23 లక్షలు.
- ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలోని శ్రీ మాధవస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- మద్దికెర మండల పెరవళి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.1 కోటి, మ్యాచింగ్ గ్రాంట్ రూ.20 లక్షలు.
- కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.27.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.5.50 లక్షలు.
- కోసిగి మండలం జమ్ములదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 లక్షలు.
- నందవరం మండలం కనకవీడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.43 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8.60 లక్షలు.
- ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణానికి సీజీఎఫ్ నుంచి రూ.40 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.8 లక్షలు మంజూరయ్యాయి.